



- స్పీకర్ పదవి వరించినా.. ఆమదాలవలసలో అభివృద్ధి శూన్యం
- నెరవేర్చని ఎన్నికలకు ముందు, తర్వాత ఇచ్చిన హామీలు
- తమ్మినేని గెలుపుపై వైసీపీ నాయకుల్లోనే సందేహాలు

సీతారామా.. ఓటమి ఖాయమా!

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నా.. ఆమదాలవలస నియోజకవర్గాన్ని కనీసస్థాయిలో పట్టించుకోకపోవడం, ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకపోవడంతో స్పీకర్ తమ్మినేని సీతారామ్ తీరుపై ప్రజలు గుర్రుగా ఉన్నారు. ఆ కోపాన్ని ఈ సారి ఎన్నికల్లో చూపి.. వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారని.. సీతారామ్ ఓటమి ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. సొంతపార్టీలోనే అసమ్మతి.. స్పీకర్ తీరుకు నిదర్శనమని.. ఈసారి ఎన్నికల్లో తమ విజయానికి ఢోకా లేదని ఎన్డీయే కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గం నుంచి 1983లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి.. తర్వాత టీడీపీలో చేరారు. 1985లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 1994, 1999లో టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. కీలకమైన మంత్రి పదవులు నిర్వర్తించారు. రాజకీయంగా ఉన్నతస్థాయికి చేరుకున్నారు. 2004లో ఓటమి తర్వాత.. 2009లో టీడీపీని వీడి ప్రజారాజ్యంలో చేరారు. పీఆర్పీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కొన్నాళ్లకే పీఆర్పీని వీడి మళ్లీ టీడీపీలో చేరారు. ఆతర్వాత టీడీపీని వీడి వైసీపీలో చేరి.. 2014లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో ఆమదాలవలస వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. వైఎస్ జగన్‌కు ప్రజలు ఇచ్చిన ఒక్కచాన్స్‌తో తమ్మినేని సీతారాం కూడా గెలుపొందారు. ఆయనకు జగన్ స్పీకర్ పదవి కట్టబెట్టగా.. నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని ప్రజలంతా భావించారు. కానీ ఐదేళ్లలో కనీస స్థాయిలో అభివృద్ధి చేపట్టలేదు. ఇచ్చిన హామీలు కూడా సక్రమంగా నెరవేర్చలేదు. దీంతో స్పీకర్ తీరుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.
- ప్రధానంగా గతుకులమయంగా.. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన ఆమదాలవలస- శ్రీకాకుళం రోడ్డును బాగుచేయలేకపోయారని స్థానికులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రతి ఒక్కరూ.. మనకు బుద్ధి ఉంటే.. ఈ సారి ఎన్నికల్లో తమ్మినేనికి మళ్లీ ఓటు వేయరాదని నిర్ణయించుకున్నారు.
- ఆమదాలవలసలో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని.. తమ్మినేనితో పాటు గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ కూడా హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ దానిని తెరిపించే ప్రయత్నం చేయలేదని.. హామీ ఉత్తిమాటేనని ప్రజలు అసంతృప్తి చెందారు.
- నియోజకవర్గంలో 'వి-ట్యాక్స్'తో ప్రజలు మరింత విసిగిపోయి.. టీడీపీ వైపు ఆదరణ చూపారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీకి వలసలు బాగా పెరిగాయి.

ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లో భారీస్థాయిలో వైసీపీని వీడి కూన రవికుమార్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. దీంతో సీతారామా.. ఓటమి ఖాయమన్న మాటలు.. ఎన్నికల ముందునుంచే వినిస్తున్నాయి. ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. స్పీకర్ గెలుపుపై వైసీపీ నాయకుల్లోనూ సందేహాలు నెలకొన్నాయి.

రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉంటూ విమర్శలు..

స్పీకర్ అంటేనే రాజ్యాంగబద్ధమైన పదవి. ఆచితూచి మాట్లాడి పదవి గౌరవాన్ని కాపాడాలి. కానీ తమ్మినేని ఈ విషయంలో స్పీకర్ కంటే.. తాను ఆమదాలవలస ఎమ్మెల్యేని అని చెప్పుకుంటూ తన స్థాయిని తగ్గించుకునేవారు. వైసీపీ నాయకులు కొడాలి నాని, జోగి రమేష్, అంబటి రాంబాబు, రోజా మాదిరిగా ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేసేవారు. గౌరవప్రదమైన స్థానంలో ఉన్నా.. చంద్రబాబును తిట్టేందుకు వెనకడుగు వేయలేదు. గతంలో టీడీపీలో కీలక పదవులు పొందినా.. అవన్నీ మరిచి.. రాజకీయ విమర్శలు చేస్తూ.. మరింత చులకనయ్యారని పలువురు పేర్కొంటున్నారు.

2019లో పార్టీల వారీగా పోలైన ఓట్లు..

అభ్యర్థి	పార్టీ	లభించిన ఓట్లు
తమ్మినేని సీతారాం	వైసీపీ	77,897 (51.91%)
కూన రవికుమార్	టీడీపీ	63,906 (42.58%)
పేడాడ రామ్మోహన్‌రావు	జనసేన	3,280 (2.19%)
నోటా	నోటా	2656 (1.77%)
బొడ్డేపల్లి సత్యవతి	కాంగ్రెస్	993 (0.66%)
పాతిని గడ్డయ్య	బీజేపీ	956 (0.64%)
తూలుగు సతీష్‌కుమార్	ఇండిపెండెంట్	383 (0.26%)
	మొత్తం	1,50,071 (79.12%)

సొంతపార్టీ నేతల నుంచే అసమ్మతి

స్పీకర్ సీతారాం.. సొంత పార్టీ నేతల నుంచే అసంతృప్తిని మూటకట్టుకున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఏకంగా నాలుగు వర్గాలుగా వైసీపీ నాయకులు విడిపోయారు. ఇందులో కళింగ సామాజికవర్గానికి చెందిన సువ్వారి గాంధీ.. వైసీపీలో పదవులకు రాజీనామా చేసి.. తన వర్గంతో వేరుకుంపటి పెట్టారు. ఇండిపెండెంట్ గా ఎన్నికల్లో పోటీచేశారు. ఈ క్రమంలో వైసీపీ ఓట్లు కొంతమేర చీలి.. తమ్మినేని ఓటమికి సువ్వారి గట్టిగా శ్రమించారని విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ చేపట్టిన సర్వేలో కూడా ఆమదాలవలస నియోజకవర్గంలో అవినీతి, అసంతృప్తి అధికమైందని వెల్లడైనట్లు సమాచారం. కానీ సరైన అభ్యర్థి లేక మళ్లీ సీతారామ్‌కే జగన్ టికెట్ కేటాయించి.. బరిలో దింపారు. కాగా.. వైసీపీలో వర్గవిభేదాలు ఓ వైపు ఉండగా. మరోవైపు టీడీపీతోపాటు జనసేనకు కూడా ఓటు బ్యాంకు పెరిగింది. ఈ క్రమంలో గత ఎన్నికల్లో 9.33 శాతం ఓట్లతో ఓటమి పాలైన.. టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌కు.. ఇప్పుడు భారీమెజార్టీ లభిస్తుందని పలువురు పందెం కాస్తున్నారు. ఈసారి కూన రవికి మంత్రి పదవి ఖాయమని.. మరికొందరు బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఫలితాల కోసం మరో 13 రోజులు వేచిచూడాల్సిందే.

సభాపతులకు పరాజయమే!

- ఈ సారీ సెంటిమెంట్ కొనసాగుతుందా?

(ఆమదాలవలస)

రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో సభాపతిగా విధులు నిర్వహించి.. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన చాలా మంది అభ్యర్థులకు పరాజయమే ఎదురైంది. ఈ నేపథ్యంలో ఈ సారీ ఆ సెంటిమెంట్ కొనసాగుతుందో.. లేదోనన్న చర్చ సాగుతోంది. ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి.. స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు ఓటమి తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1956 సంవత్సరం నుంచి 2014 వరకు అసెంబ్లీ స్పీకర్లుగా వ్యవహరించిన రాజకీయ నేతలంతా.. పదవి అనంతరం జరిగిన ఎన్నికల్లో ఓటమి చవిచూసిన దాఖలాలు ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభాపతి అయ్యదేవర కాళేశ్వరరావు 1956 నుంచి 1962 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. 1962లో శాసనసభకు మళ్లీ ఎన్నికయ్యారు. కానీ ఫలితాలకు ముందే ఆయన ప్రాణాలు కోల్పోయారు. రెండో స్పీకర్‌గా బీవీ సుబ్బారెడ్డి 1962 నుంచి 1970 వరకు కొనసాగారు. వారి తర్వాత శాసనసభాపతులుగా కొనసాగిన కె.వి.వేమారెడ్డి, పి.రంగారెడ్డి, ఆర్.దశరథరామిరెడ్డి, డి.కొండయ్య చౌదరి, కె.ప్రభాకరరావు, ఏ.ఈశ్వర్‌రెడ్డి, తంగి సత్యనారాయణ, ఎస్.వెంకటరత్నం, పి.రామచంద్రారెడ్డి.. తక్కువ కాలం స్పీకర్ పదవి చేపట్టారు. జి.నారాయణరావు, డి.శ్రీపాదరావు, యనమల రామకృష్ణుడు, కె.ప్రతిభాభారతి, కె.ఆర్.సురేష్‌రెడ్డి ఐదేళ్లపాటు పూర్తిస్థాయి స్పీకర్లుగా వ్యవహరించారు. 2009 ఎన్నికల్లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రెండేళ్లుగా స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన అనంతరం నాదెండ్ల మనోహర్ స్పీకర్‌గా వ్యవహరించారు. 2014 నుంచి 2019 వరకు కోడెల శివ ప్రసాద్ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. వీరంతా స్పీకర్లు బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎన్నికల్లో పోటీ చేయగా.. చాలా మంది ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో కోడెల శివప్రసాద్ కూడా ఓడిపోయారు. 2019 నుంచి స్పీకర్‌గా వ్యవహరిస్తున్న తమ్మినేని సీతారాం.. ఈసారి ఎన్నికల్లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరి లో దిగారు. ఈ ఐదేళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి ఆయన ఓటమి తప్పదని.. 'స్పీకర్ల ఓటమి' సెంటిమెంట్ కొనసాగడం ఖాయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



మాట్లాడుతున్న జేసీ నవీన్, పక్కన డీఆర్వో గణపతిరావు

ఓట్ల లెక్కింపు నిర్వహణలో అలసత్వం వద్దు

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

కలెక్టరేట్, మే 21: జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అలసత్వానికి చోటు లేదని.. అందరూ అప్రమత్తంగా ఉండాలని జేసీ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. 'ఒక్కో హాల్‌లో అబ్జర్వర్‌కి ఒక సహాయకుడు ఉండాలి. లేబర్ అరేంజ్‌మెంట్‌కు సంబంధించి డ్వామా పీడీ తగు ఏర్పాట్లు చేయాలి. ఈ నెల 25న శిక్షణా తరగతులకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ జరుగుతుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై పూర్తి శిక్షణ ఇవ్వాలి. గురువారం ఆర్‌వోలకు, ఏఆర్‌వోలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామ'ని తెలిపారు. మీడియా సెంటర్, సీసీ టీవీ, వీడియోగ్రాఫర్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీసు అధికారులతో మాట్లాడారు. లెక్కింపు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈఓ వేంకటేశ్వరరావు, సుడా వీసీ ఓబులేసు, ఎస్ఎస్ఏ పీవో జయప్రకాష్, డీపీవో వేంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ చిట్టిరాజు, డిప్యూటీ సీఈవో వెంకటరామన్, ఎంప్లాయిమెంట్ అధికారి సుధ, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో పోలీసుల కార్డెన్‌సెర్చ్



పాతపట్నం: పెద్దమల్లిపురంలో..



హిరమండలంలో.. వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ నారాయణస్వామి



గార: కొయ్యానపేటలో..



జి.సిగడాం: కిరాణాషాపులో పోలీసుల తనిఖీలు

సిక్కోలులో కార్డెన్‌సెర్చ్

- శాంతియుత వాతావరణానికి పోలీసుల చర్యలు
- అల్లర్లు సృష్టించొద్దని హెచ్చరికలు

(శ్రీకాకుళం క్రైం/ జి.సిగడాం/ పాతపట్నం / గార/ హిరమండలం)

సిక్కోలులోని పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు గడువు సమీపిస్తున్న వేళ.. గ్రామాల్లో శాంతియుత వాతావరణ నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాధిక ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు సమస్యాత్మక గ్రామాల్లో పికెట్లు, పెట్రోలింగ్ నిర్వహించి ఘర్షణలు, అల్లర్లు చోటుచేసుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. రోజూ గ్రామాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి.. అనధికార వాహనాలు, మద్యం, బాణసంచా సామగ్రి నిల్వలపై సోదాలు చేస్తున్నారు. ఇళ్లలోను, గడ్డికుప్పలను.. పాడుబడిన షెడ్లను.. అనుమానంకలిగే ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. అరటి, మామిడి తోటలను సైతం గాలిస్తున్నారు. చెక్ పోస్టులు, ముఖ్య కూడళ్లలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా నివారణకు చర్యలు చేపడుతున్నారు. అలాగే లూజు పెట్రోలు విక్రయించకుండా బంకుల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

- జి.సిగడాంలో ఎస్ఐ వై. మధుసూదనరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. గడ్డివాములు, పలు దుకాణాల్లో బాణసంచా సామగ్రి ఉందేమోనని తనిఖీలు చేశారు.
- పాతపట్నం మండలం పెద్ద మల్లిపురంలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహ్మద్ యాశిన్, టి.రాజేష్ సారథ్యంలో తనిఖీలు చేశారు.
- గార మండలం కొయ్యానపేటలో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు.
- హిరమండలం మండలం సుభలయ కాలనీలో ఎస్ఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన తనిఖీలు చేపట్టి.. సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి 'అనారోగ్యశ్రీ'!

- సేవలు నిలిపివేస్తామన్న ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్
- మంగళవారం రాత్రి వరకు స్పందించని ప్రభుత్వం
- ఆందోళనలో రోగులు..

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



ఆరోగ్యశ్రీ సేవలు బుధవారం నుంచి నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం గతేడాది ఆగస్టు నుంచి ఆరోగ్యశ్రీ బిల్లులు నిలిపి వేయగా.. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,500కోట్లు బకాయిలు ఉన్నాయి. జిల్లా నుంచి సుమారు రూ.150కోట్లు బకాయి ఉన్నట్టు అంచనా. ఈ బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీని అమలుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) కఠిన నిర్ణయం తీసుకుంది. బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ఆస్పత్రుల్లో రూ.వెయ్యి ఖర్చయితే ఆరోగ్యశ్రీ కింద భరిస్తామని అప్పట్లో సీఎం జగన్ ప్రకటించారు. వైద్యపరీక్షల విషయంలో మాత్రం ఆరోగ్యశ్రీలో అమలు కావడం లేదు. కేవలం గుండె ఆపరేషన్లు, స్టంట్‌లు, కిడ్నీలో రాళ్ల తొలగింపు, సిజేరియన్లు, ఇతరత్రా అత్యవసర శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించేవారు. వాటికి సంబంధించిన ఖర్చును ప్రైవేటు ఆసుపత్రిలకు ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు సక్రమంగా చెల్లించకపోవడంతో సేవలను నిలిపేయనున్నారు. శ్రీకాకుళంలో కిమ్స్, జెమ్స్, మెడికవర్ వంటి కార్పొరేట్ ఆసుపత్రిలతోపాటుగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస పట్టణ కేంద్రాల్లో ఉన్న ఏరియా ఆసుపత్రిలు, ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిల్లో ఆరోగ్యశ్రీ సేవలు ఇప్పటివరకు లభిస్తున్నాయి. జిల్లాలో చాలామంది కిడ్నీ బాధితులు కూడా ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ఉపశమనం పొందేవారు. కాగా.. బుధవారం నుంచి సేవలను నిలిపివేస్తారా.. లేదా? అన్నది.. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడనుంది. మంగళవారం రాత్రి వరకు ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడలేదు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతే తమ పరిస్థితి ఏమిటని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని.. కోరుతున్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- డీఆర్వో గణపతిరావు

కలెక్టరేట్/ గుజరాతీపేట మే 21: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. 'పరీక్షలకు జిల్లాలో 23,668 విద్యార్థులు హాజరు కానున్నారు. 51 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాం. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పించాలి. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. పోలీసు బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాల'ని ఆదేశించారు. సమావేశంలో ప్రాంతీయ తనిఖీ అధికారి దుర్గారావు, ఒకేషనల్ అధికారి ప్రకాశరావు, డీఈసీ శ్యామ్‌సుందర్, కె.తవిటినాయుడు, జి.సింహాచలం, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డీఈవో వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పదోతరగతి అడ్వాన్స్ కూడా..

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా ఈ నెల 24 నుంచి నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 9 కేంద్రాల్లో సుమారు 2,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థ ఉండాలి

- నీతి అయోగ్‌కు ఫెమ్మీ నివేదిక

టెక్కలి, మే 21: ఒకే దేశం, ఒకే ఖనిజం, ఒకే రాయల్టీ అనే అంశంపై నీతిఅయోగ్ న్యూఢిల్లీలో సోమవారం సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో చిన్న ఖనిజ పరిశ్రమల సమాఖ్య(ఫెడరేషన్ ఆఫ్ మైనర్ మినరల్స్ ఇండస్ట్రీ-ఫెమ్మీ) ప్రతినిధి బృందం సభ్యులు పాల్గొని వివిధ అంశాలపై నివేదికను అందజేశారు. దేశం మొత్తంగా ఒకే పన్ను వ్యవస్థ ఉండాలని, మైనర్ మినరల్ ఆక్షన్ తీసివేయాలని నీతిఅయోగ్‌కు సూచించారు. వివిధ రాష్ట్రాల్లో చిన్న ఖనిజాలపై విధించిన రాయల్టీ రేట్లు, ఇతర సుంకాలపై కూడా అవగాహన కల్పించారు. వంద రోజుల్లో ఈ సూచనలను పార్లమెంట్‌లో రూపకల్పన చేసేలా చర్యలు తీసుకుంటామని నీతిఅయోగ్ అధికారులు వెల్లడించారు. దేశ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి కల్పనలో చిన్నపరిశ్రమల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించడం శుభపరిణామమని ఫెమ్మీ ప్రతినిధి బృందం సభ్యులు తెలిపారు. ఎఫ్ఐఎంఐ, ఎంఈఏఐ, ఎఫ్ఏఎంఆర్, జీయూజేఎంఐఎస్ మినరల్ ఇండస్ట్రీ అసోసియేషన్స్ ద్వారా సంబంధిత స్టేట్‌హోల్డర్స్ అభిప్రాయాలు కూడా సేకరించారు. కార్యక్రమంలో ఫెమ్మీ జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ రావు, వైస్‌ప్రెసిడెంట్ సుబ్బారావు, నీతిఅయోగ్ మెంబర్ డాక్టర్ సారస్వాత్, మైన్స్ సెక్రటరీ కాంతారావు, న్యాయాధికారులు పాల్గొన్నారు.



నీతిఅయోగ్ అధికారులకు వినతి అందజేస్తున్న ఫెమ్మీ సభ్యులు

సురంగిరాజా మైదానంలో ఆక్రమణలు

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ఇంటి నిర్మాణం
- అడ్డుకోవాలని కమిషనర్, ఆర్ఐకి వినతి

ఇచ్ఛాపురం, మే 21: ఇచ్ఛాపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన సురంగిరాజా మైదానంలో ఆక్రమణలను అడ్డుకోవాలని సీనియర్ క్రీడాకారులు, రిటైర్డ్ ఉద్యోగులు మునిసిపల్ కమిషనర్ ఎస్.రమేష్, ఆర్ఐ శ్రావణ్ కుమార్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం వారికి వినతిపత్రాలను అందజేశారు. పూర్వం సురంగి రాజావారు విద్యార్థుల ఆట స్థలం కోసం సుమారు 5 ఎకరాలు హైస్కూల్‌కు విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి వేలాది మంది విద్యార్థులు ఈ మైదానంలో ఆడుకుంటున్నారు. ఇక్కడ క్రీడలు ప్రాక్టీస్ చేసిన విద్యార్థులు జాతీయస్థాయిలో కూడా రాణించి బంగారు పతకాలు కూడా సాధించారు. ఎంతోమందికి ఉపయోగపడే ఈ మైదానాన్ని.. ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఆక్రమణకు పాల్పడింది. తప్పుడు పత్రాలు సృష్టించి.. ఆక్రమించిన స్థలంలో ఇల్లు నిర్మిస్తోంది. వెంటనే ఈ అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని కమిషనర్, ఆర్ఐను క్రీడాకారులు కోరారు. కార్యక్రమంలో క్రీడాకారులు ఉప్పాడ డిల్లీ, కస్పా పాపారావు, బత్తిన బాలాజీ, శేఖర్, బదాని, రిటైర్డ్ ఉద్యోగి వాసు పాల్గొన్నారు.



ఆర్ఐ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న క్రీడాకారులు

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు (రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉం డాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు- 522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి DIKSUCHI

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.cbip.org

SCHOLARSHIP ALERT

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1



NextGen Edu Scholarship

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).

Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Wn7hfeQలో చదవండి.



కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబూటర్స్, కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.


కొత్త తేదీన హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు



అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.

పారితోషికం రూ.250 కోట్లా?



బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాపురే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!

డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, స్మ్రిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేదని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.



జూన్‌లో 'ఓ.సి' వినోదం

హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. బీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్., అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/y8pE852 లో చదవండి.

అశ్వవాహనంపై బ్రహ్మాండ నాయకుడు



ప్రధాన మార్గంలో స్వామి తిరువీధిలో పాల్గొన్న భక్తులు, కోలాట ప్రదర్శన

నరసన్నపేట: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుల వేద మంత్రాల మధ్య శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసునికి ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశ్వ వాహనంపై స్వామిని వేంచేపు చేసి పట్టణంలో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని పారవశ్యం పొందారు. ఆలయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అశ్వ వాహనంపై శ్రీనివాసుని తిరువీధి

అమ్మవార్లకు చల్లదనం



అమ్మవారి ఆలయాలకు కలశాలతో బయలుదేరిన మహిళలు

ఎల్.ఎన్.ఎన్.పేట: జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం మహిళలు గ్రామదేవతలకు చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఊరేగింపులతో గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. లక్ష్మీనర్సుపేటలో జరుగుతున్న బంగారు సంతోషిమాత గ్రామదేవత ఉత్సవాల్లో భాగం గా మంగళవారం గ్రామస్థులు కలశాలు పట్టుకుని గ్రామానికి చుట్టూ ఉన్న ఉత్తర అమ్మవారు, పాతపట్నం నీలమణిదుర్గమ్మ, దక్షిణ అమ్మవారు, తరిణా అమ్మవార్లకు చల్లదనం చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలతో గ్రామస్థులంతా ఒక్కసారి బయలు దేరడంతో వీధులన్నీ కిటకిటలాడాయి. ఉత్సవాలు ముగిసేంతవరకు అమ్మవారు ప్రతిరోజూ వివిధ రూపాల్లో దర్శన మిస్తారని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గోదావరి పోలమ్మ వారాలు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో గోదావరి పోలమ్మ తల్లి వారాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో గ్రామస్థులంతా కలిసి వారాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలు, డప్పులు, తప్పెడుగుళ్ల ప్రదర్శన మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ముర్రాటలు పోసి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపేట సంబరాలు

వజ్రపుకొత్తూరు: కొత్తపేట గ్రామంలోని గ్రామదేవత పెద్దమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామస్థులు దర్శించుకుని ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యువకుల పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరి, మాజీ సర్పంచ్ గోవింద పాపారావు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి ముర్రాటల సమర్పణ



ఊరేగింపులో మహిళల కోలాట ప్రదర్శన

జలుమూరు: పెద్దదూగాంలో వెలసిన పెద్దమ్మతల్లి గ్రామదేవతకు గ్రామస్థులు మంగళవారం ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. ప్రతీ ఏటా తొలకరి వర్షాలు పడగానే ఆవేటిలో గ్రామదేవతకు చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం మంగళ వాయిద్యాల నడుమ మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా ఆవేటి వారాలు



కలశాలతో అమ్మవారి ఆలయాలకు వెళుతున్న మహిళలు

హిరమండలం: సుభలయ ఆర్ఆర్ కాలనీ పంచాయతీలో మంగళవారం గ్రామ దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు కలశాలు, ముర్రాటలతో మేళ తాళాల మధ్య ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. చెవిటమ్మ తల్లి, కొండ దేవతమ్మ, కొండ జాకరమ్మ, నీలమణిదుర్గ అమ్మవారు, అగ్రహారం తల్లి ఆలయాలకు వెళ్లి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి 'తమ్మినేని' కృషి

పలాస: విద్యార్థులను సక్రమంగా తీర్చిదిద్దడంతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ్మినేని సూర్యనారాయణ చేసిన కృషి ప్రశంసనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ అన్నారు. వజ్రపుకొత్తూరు మండల ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి దివంగతులైన సూర్యనారాయణ సంతాపసభ మంగళవారం స్థానిక రోటరీనగర్‌లో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేసిన సూర్యనారాయణను ఆదర్శంగా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, కార్యదర్శి డి.సరస్వతి, ప్రతినిధులు ఎన్వీ అనిల్‌కుమార్, బి.సుభాష్ బాబు, పీవీ రమణ, కె.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్త

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ పరిధిలో అతి సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్, ఆర్వో నూరుల్ కమర్ స్పష్టం చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ బాల చంద్రారెడ్డితో కలిసి పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానితులు, చెడు ప్రవర్తన కలిగిన వారిని ముందుగా గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. జూన్ 7వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందువల్ల ర్యాలీలు, సభలు, సమావేశాలకు పోలీసుల నిషేధాజ్ఞలున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఈఆర్వో మురళీకృష్ణ, సీఐ పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను మంగళవారం ఆర్వో నూరుల్ కమర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ ఉండడంతో పాటు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్వో తెలిపారు. పరిశీలించిన వారిలో టీడీపీ నేతలు కింజరాపు హరిప్రసాద్, లాయర్ అచ్చెన్నాయుడు తదితరులున్నారు.



చిలకపాలెం శివానీ కాలేజీలో స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఆర్వోతో పార్టీల నేతలు

ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి: డీఎస్పీ

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సి బాధ్యత అందరిపై ఉందని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. బెండి గ్రామంలో గ్రామస్థులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌లో భాగంగా రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఫలితాలు వచ్చిన తరువాత కూడా సంయమనం పాటించాలన్నారు. యువత ఆవేశాలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలను వివరించారు. గ్రామాల్లో తరచూ శాంతిభద్రతలపై సమీక్షించాలని సూచించారు. సమావేశంలో కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ రామారావు, ఏఎస్ఐ జున్నారావు తదితరులు పాల్గొన్నారు.



బెండి గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తగాదాలకు దూరంగా ఉండాలి

టెక్కలి: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు గ్రామాల్లో తగాదాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ మురళీకృష్ణ, సీఐ పి.పైడయ్య అన్నారు. మంగళవారం రాత్రి రావివలసలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చెడు ప్రవర్తన కలిగిన వారిపై దృష్టి సారించడం జరుగుతుందని, అవసరమైతే బైండోవర్లు చేయిస్తామన్నారు.

రాజీవ్ హయాంలోనే విప్లవాత్మక మార్పులు



టెక్కలి: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టెక్కలి: మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశంలో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కేంద్ర మాజీ మంత్రి డా.కిల్లి కృపారాణి, డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని టెక్కలిలో మంగళవారం నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ.. ఢిల్లీ నుంచి గల్లీ వరకు జవహర్ గ్రామీణ రోజ్‌గార్ యోజన ద్వారా నిధులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. 73-74 రాజ్యాంగ సవరణ, ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మక మార్పులు, 18 ఏళ్లకే ఓటుహక్కు కల్పించిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, టీటీజీ గుప్త, పొట్నూరు ఆనందరావు, గోరింట కృష్ణ, మాధవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో..

కాశీబుగ్గ: భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కాశీబుగ్గ పాత బస్టాప్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తంగుడు వీర్రాజు, రమేష్ సాహు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి: పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో ఉషశ్రీ, సూపరింటెండెంట్ బలగ ప్రకాష్ తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన ప్రధానిగా అమలు చేసిన అనేక పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం, రెవెన్యూ, 108, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరించండి

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరులోని తాగునీటి పథకం పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి వివిధ కార్యాలయాలు, గ్రామంలోని పలు వీధులకు నీటి సరఫరా చేస్తుండేవారు. అయితే 15 రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో కార్యాలయాల సిబ్బంది, ప్రజలు దాహార్తితో ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విశ్రాంతి భవనాలులేక పాట్లు



నందిగాం అండర్‌పాసేజ్ సర్వీస్ రహదారిలో చెట్ల కింద, షాపుల వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

నందిగాం: మండలంలో ఎక్కువ శాతం జాతీయ రహదారి విస్తరించి ఉన్నప్పటికీ పలు కూడళ్లలో విశ్రాంతి భవనాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నందిగాంతో పాటు కొండల ప్రాంత ప్రధానకూడలి పెద్దతామరాపల్లి, నర్సిపురం జంక్షన్, తురకలకోట, పెద్దలవునిపల్లి తదితర కూడళ్లలో బస్సు ప్రయాణికులకు ఎటువంటి నీడ లేకపోవడంతో ఎండలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. నందిగాం వచ్చేసరికి అండర్ పాసేజ్ కింద, షాపులు వద్ద, సర్వీసు రహదారి డ్రైనేజీలపై బస్సులు, వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. పెద్ద తామరాపల్లి సర్వీసు రహదారి గుండా బస్సులు రాకపోవడంతో జాతీయరహదారిపై బస్సుల కోసం ఎండలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ చూపి ప్రధాన కూడళ్లలో విశ్రాంతి భవనాలనునిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలపై సర్వే చేయండి

పోలాకి: గ్రామాల్లో గతంలో చేపట్టిన మరుగుదొడ్లు, చెత్తసంపద కేంద్రాల నిర్వహణ వివరాలపై సర్వే చేపట్టి వారం రోజుల్లోగా కార్యాలయానికి అందజేయాలని ఎంపీడీవో ఉషశ్రీ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కారణంగా సర్వేలో జాప్యం జరిగిందని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బి.పద్మావతి, ఎంసీవో దంత కృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంశధార నీటి విడుదలకు చర్యలు తీసుకోండి

వజ్రపుకొత్తూరు: మండలంలోని శివారు ప్రాంత భూములకు వంశధార నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నాలుగేళ్లుగా వంశధార నీరు రాకపోవడంతో సుమారు సుమారు 11 పంచాయతీల్లో పంట పొలాలు ఎండిపోయి బీటలు వారాయని వాపోయారు. వేసవికాలంలోనే వంశధార కాలువల్లోని పూడికలు తీసి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, అయితే గడచిన నాలుగేళ్లలో అటువంటి చర్యలు తీసు కోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతాంగ నాయకులు దువ్వాడ అప్పారావు, సనపల చక్రవర్తి, బగాది చెల్లయ్య, లక్ష్మీ నారాయణ తదితరులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పలాసరూరల్: పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వరిశ జానారావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మంగళవారం టీడీపీ పలాస నియో జకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, పీరికట్ల విఠల్‌రావు పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

గ్రంథాలయ ఆవశ్యకతపై అవగాహన

నందిగాం: గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్ మంగళవారం అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ సేవలను వివరించారు. అనంతరం ఖోఖో పోటీలు నిర్వహించారు.

లభ్యం కాని గ్రానైట్ వ్యాపారి ఆచూకీ?


అదృశ్యమైన కాలేసుబోజీ

టెక్కలి: హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన గ్రానైట్ వ్యాపారి కాలే సుబోజీ గత నెల 19న టెక్కలి మండలం మేలి సతివాడ ప్రాంతంలో అదృశ్యమైనా నేటికీ అతని ఆచూకీ లభించలేదు. ఈ ఘటన జరిగి 33 రోజులైనా అతని జాడ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. సుబోజీ ఏప్రిల్ 19న విజయవాడ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌తో కలిసి ఏడు హెక్టార్ల గ్రానైట్ పరిశీలనకువచ్చారు. సదరు క్వారీ యజమాని ఆవుల వేణుగోపాల్, వెంకటేష్‌లు గ్రానైట్ ప్రాంతానికి నడుచు కుని సుబోజీ కన్నా ముందు వెళ్లారు. కొంతసేపటి తరువాత వెంకటేష్‌కు తనతో వచ్చిన సుబోజీ కనిపించకపోవడంతో యజమానితో కలిసి ఆ ప్రాంతంలో గాలించారు.అయితే ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో టెక్కలి సీఐ పి.షైడయ్యకు వెంకటేష్ ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సుబోజీ కుటుంబ సభ్యులకు, బంధువులకు వెంకటేష్ తెలియజేశారు.ఈఘటనపై సుబోజీ భార్య రాజేశ్వరి భర్త అదృశ్యంపై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్‌వేశారు. దీనిపై ఎస్ఐ లక్ష్మి హుటాహుటిన హైకోర్టుకు వెళ్లారు. అయితే అతని ఆచూకీ నేటి వరకు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ ఘటనపై డీఎస్పీ బాలచంద్రారెడ్డి వద్ద ప్రస్తావించగా తాము ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టామని, సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నా అయన ఆచూకీ లభ్యం కాలేదన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

● సకాలంలో వైద్యం అందలేదని బంధువుల ఆవేదన


రోదిస్తున్న వినీత్ తల్లి నిరోష

టెక్కలి/నరసన్నపేట: టెక్కలి మండలంలోని చిన్ననారాయణపురానికి చెందిన బాలుడు పాముకాటుతో మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు...చిన్ననారాయణపురానికి చెందిన దాసరిమురళి, నిరోషల కుమారుడు సాయి వినీత్ (13)గ్రామంలో మంగళవారం తోటివిద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ముళ్లపొదల్లోకి వెళ్లిన బంతిని తీసుకువెళ్లెందుకు వెళ్లిన వినీత్‌ను విష సర్పం కాటేసింది. దీంతో కొద్ది సమయానికే వినీత్ స్పృహ కోల్పేవడంతో తల్లిదండ్రులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు రిమ్స్‌కు రిఫర్‌చేశారు. నరసన్నపేట దగ్గరకు వచ్చేసరికి వినీత్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో వినీత్‌ను పరీక్షలు చేయగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యుడు పి.శంకరరావు నిర్ధారించారు. కాగా సకాలంలో వైద్యం అందించకుండా నిండు ప్రాణాలను బలితీసుకున్నారని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన కుమారుడు మృతిచెందాడని వినీత్ తల్లి నిరోష, బంధువులు ఆరోపించారు. నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కన్నీరు మున్నీరుగా రోదించారు. టెక్కలి ఆసుపత్రి వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వినీత్ బంధువులు డిమాండ్ చేశారు. చిన్న నారాయణపురంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో..

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని బీఆర్‌నగర్ సమీపంలో ఉన్న పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన విషయాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. ఈమేరకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు.అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లుగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు ఇసుక లారీలు సీజ్

ఆమదాలవలస: మండలంలోని చవ్వాకులపేట వద్ద వంశధార నదిలో కొంతకాలంగా అనధికారికంగా నిర్వహిస్తున్న ర్యాంప్ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలు,యంత్రాలను పోలీసులుసీజ్‌చేశారు. ఎస్ఐ కె.వెంకటేష్ కథనం మేరకు..ఆమదాలవలస ఎస్ఈబీఅధికారులు ఈనెల 20వ తేదీ సాయంత్రం ఇసుక ర్యాంప్‌పై దాడులు నిర్వహించారు. ఆప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న మూడులారీలు, జేసీబీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అదేరోజు రాత్రి ఏడుగంటలకు ఎస్ఈబీ ఎస్ఐ వీఎల్‌కే స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీలు, జేసీబీను సీజ్ చేశారు.

విత్తనాలకు ప్రతిపాదనలు: జేడీఏ


మాట్లాడుతున శ్రీధర్

కవిటి: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, క్రిమిసంహారక మందుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు కె.శ్రీధర్ తెలిపారు. మంగళవారం గొండ్యాలపుట్టుగలోఖరీఫ్‌లో వరిసాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో విత్తనోత్పత్తి చేసేందుకు రైతులు ముందుకు రావాలనికోరారు.కవిటి ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డీఏవో భవానీశంకర్, సోంపేట ఏడీ కె.జగన్మోహనరావు, ఏవో బి.నర్సింహమూర్తి, ఎఫ్‌పీవో అధ్యక్షుడు బి.కృష్ణారావు పాల్గొన్నారు.

●**సోంపేట:**ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధంచేస్తున్నట్లు జేడీఏ కె.శ్రీధర్ తెలిపారు. సోంపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన జీలుగు, జనుము, పచ్చిరొట్టి విత్తనాల సరఫరాలో అవాంతరాలు ఉండకూడదని తెలిపారు.

కొత్తవారి కదలికలపై దృష్టి సారించాలి


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గార: సముద్రతీరంలో మెరైన్ ఫిషరీస్, కోస్ట్‌గార్డ్ అధికారులు అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘాపెట్టారు.ఈమేరకు మంగళవారం బందరువానిపేటలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తీరంగుండా అనుమానిత వ్యక్తులు ప్రవేశించే అవకాశంఉండడంతో అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు కనిపిస్తే వారి కదలికలపై దృష్టి సారించాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉంటే వెంటనే సమాచారాన్ని దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ నారీమణి, ఎస్ఐ మహాలక్ష్మి కోస్ట్‌గార్డ్, ఫిషరీస్ అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో నాలుగు మండలాలు, మునిసిపాలిటీ పరిధిలోఅవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఆర్వో సుదర్శన్ దొర కోరారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల పోలీసు, రెవెన్యూఅధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం,సోంపేటసీఐలు ఇమ్మాన్యుయేల్‌రాజు, మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం, రూరల్, కంచిలిఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణ్, రాజేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న, సుదర్శన్ దొర

వసతులు లేక.. ఆసక్తి చూపక

● ఏటేటా తగ్గుతున్న ప్రవేశాలు
● విద్యార్థులు లేక వెలవెలబోతున్న వైనం
● వేసవిలో మరమ్మతులకు చర్యలు తీసుకోని అధికారులు
● ఇదీ జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో పరిస్థితి

ఇచ్ఛాపురం: జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో ఏటేటా ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు ప్రవేశాలకు ఎంతగానో ఆదరణ ఉండేది. ఒక్కోసీటు సంపాదించేందుకు సిఫారసులు చేయాల్సివచ్చేది. రానురాను వసతులు సక్రమంగా కల్పించకపోవడంతో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వెలవెలబోతున్నాయి. శిథిలా వస్థకు చేరిన భవనాలను ప్రస్తుత వేసవి కాలంలో సంక్షేమ శాఖ అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.


ఇచ్ఛాపురంలోని బీసీ హాస్టల్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో జిల్లాలో 63 బీసీ, 30 ఎస్సీ, 25 ఎస్టీ హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. వీటిలో పేద విద్యార్థులకు చదువుతోపాటు వసతి, భోజన సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ.. విద్యార్థుల ఆలనాపాలనపై ప్రత్యేక దృష్టి సారించేవారు. అయితే వైసీపీ అధికారంలోక వచ్చిన తర్వాతవీటి నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో సంక్షోభ పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వ హాస్టళ్లలో సీటు కావాలంటే సిఫార్సు ఉంటే గాని దక్కేదికాదు. ప్రస్తుతం కనీసం సగం సీట్లు కూడా నిండని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కిందట నిర్మించిన హాస్టళ్ల భవనాలు కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరాయి. దీంతోపాటు సరైన నిర్వహణ, రక్షణ లేకపోవడంతో తమ పిల్లలను ప్రభుత్వం హాస్టళ్లలో చేర్పించేందుకు తల్లిదం డ్రులు ఆసక్తి చూపడం లేదు. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది.


ఇచ్ఛాపురం బీసీ హాస్టల్‌లో తక్కువ సంఖ్యలొ ఉన్న విద్యార్థులు (ఫైల్)

మరమ్మతులకు నోచుకోక..

ఇచ్ఛాపురం పట్టణంలోని బెల్లుపడ కాలనీ సమీపంలో గల బాలరు వసతి గృహంలో గత విద్యాసంవత్సరంలో 20 మంది లోపు విద్యార్థులు ఉండేవారు. గతంలో ప్రతి హాస్టల్ వందల మందితో కళకళ లాడేవి. ప్రస్తుతం పదుల సంఖ్యలో విద్యార్థులు చేరని పరిస్థితి నెలకొంది. సరైన సౌకర్యాలు, మంచి ఆహారం అందకపోవడంతో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడం లేదు. 118 హాస్టళ్లలో పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరడంలేదు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ సమయంలో శిథిలావస్థలో ఉన్న వసతి గృహాల మరమ్మతులపై సంక్షేమశాఖ అధికారులు దృష్టిసారిం చడంలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నిర్వహణ లేక..

టీడీపీ ప్రభుత్వ హయాంలో హాస్టళ్లను సమర్థంగా నిర్వ హించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహణ నీరుగార్చడంతో పాటు వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ఇంకా మూడు వారాలు మాత్రమే మిగిలి ఉంది. హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కల తొలగించడంతోపాటు మరమ్మతులపై దృష్టిసారించడంలేదు. గత ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పలు రాయితీలు కూడా నేటికీ అందలేదు. తొలి త్రైమాసికంలో అక్టోబరు నాటికి మాత్రమే ప్రభుత్వం కాస్మెటిక్స్ చార్జీలు విడుదల చేసి తల్లుల ఖాతాల్లో వేసింది. బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులకు డిసెంబరు వరకు ఇటీవల నిధులు విడుదల చేసినట్లు సమాచారం. విద్యా సంవత్సరం పూర్తయినా అవి వారికి అందకపోవడం గమనార్హం. హాస్టళ్లలో తక్కువ మంది చేరుతుండడంతో ఉన్న కొద్దిమంది కూడా భయాందోళనతో హాస్టళ్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా సంక్షేమాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వార్డెన్లు అందుబాటులో ఉండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు చేర్పించేందుకు ముందుకురావడం లేదు.

పొందూరులో పైడితల్లమ్మ సంబరాలు

పొందూరు: పొందూరులో మంగళవారం తొల్లోడి పైడితల్లమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నాయుడువారివీధి, చెల్లూరివారివీధిలో మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, తప్పెటగుళ్లు, పులి వేషాలు ఆటలతో సంబరాలు జరిగాయి. చెల్లూరువారివీధిలోని పైడి తల్లమ్మ ఆలయానికి చేరుకుని చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. చెల్లూరి జయమ్మ అమ్మవారి ప్రతి రూపంగా నృత్యం చేస్తూ ఆలయానికి చేరుకున్నారు సంబరాల్లో చెల్లూరు సూరిబాబు, సురేందర్‌కుమార్, డాక్టర్‌రాజేష్, డొకర శ్రీను, అచ్చియమ్మ, రాజమ్మ లీల తదితరులు పాల్గొన్నారు.


పొందూరు: అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

గదబపాలెంలో అసిరితల్లి పండుగ

జి.సిగడాం:మండలంలోని గదబపాలెంలో అసిరితల్లి గ్రామదేవత పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న అమ్మవారి ఆలయంలో మహిళలు పసుపు, కుంకుమలు, ముర్రాటలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం, తప్పెటగుళ్లు, జానపదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

బెజ్జిపుట్టుగలో కుంకుమ పూజలు

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామదేవత అసిరిపోలమ్మతల్లికి మంగళవారం సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. రాజేష్ స్వామి నేతృత్వంలో ఉపాధి వేతనదారుల ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి పూజలు చేపట్టారు.

●**ఇచ్ఛాపురం:**ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పలు వీధులకు చెందిన భక్తులు పూజలుచేశారు. గొల్లవీధి, ఉప్పాడ వీధులకు చెందిన కుటుంబాలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చిమొక్కులు చెల్లించారు.

బూరవెల్లిలో నృసింహ జయంతి

గార:బూరవెల్లిలో ప్రాచీన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం నృసింహ జయంతిని ప్రధాన అర్చకులు అరవెల్లి సీతారామ స్వామి అర్చకులు, రాజేష్, శ్రీనివాస్, రమేష్ నిర్వహించారు. తొలుత విశ్వక్షేణ పూజ, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకం, సహస్రనామ అర్చన చేశారు.

ఓట్ల లెక్కింపు పరిశీలకుల నియామకం

● నియోజకవర్గాల ప్రత్యేకాధికారులకు కౌంటింగ్ పర్యవేక్షణ బాధ్యత

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ నాలుగో తేదీన వెలువడనున్నాయి. ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా జరిపేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతినియోజకవర్గానికి ఓ ప్రత్యేకాధికారిని నియమించింది. కౌంటింగ్‌ను పర్యవేక్షించే బాధ్యతఅప్పగించింది. ఈమేరకు జిల్లాలో ఎనిమిది నియోజ కవర్గాలకు ముగ్గురు ఐఏఎస్ అధికారులను, ఐదుగురు ఎస్‌సీఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. వారి ఫోన్ నంబర్లను సైతం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది.

నియోజకవర్గాల వారీగా ఓట్లలెక్కింపు పరిశీలకులు వీరే..

నియోజకవర్గం	పేరు	ఫోన్ నంబర్
ఇచ్ఛాపురం	సందీప్‌కుమార్ (ఐఏఎస్)	7880658442
పలాస	మల్లు ఎస్ సంగ్మా(ఎస్‌సీఎస్)	9736101595
టెక్కలి	అనుజాకుమార్ దాస్ పట్నాయక్(ఎస్‌సీఎస్)	9438542354
పాతపట్నం	అశోక్‌కుమార్ (ఎస్‌సీఎస్)	9414170625
శ్రీకాకుళం	శేఖర్ విద్యార్థి (ఐఏఎస్)	8199011111
ఆమదాలవలస	డాక్టర్ ఎస్.సంగీత (ఎస్‌సీఎస్)	9840889966
నరసన్నపేట	అజిత్ శుక్లాదాస్ (ఎస్‌సీఎస్)	9436456044
ఎచ్చెర్ల	టలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా (ఐఏఎస్)	9419400065

దేశాభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ కృషి


అరసవల్లి: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అరసవల్లి:దేశాభివృద్ధికోసం రాజీవ్ గాంధీ కృషిచేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల అభ్యర్థులు అంబటి కృష్ణారావు, మంత్రి నర్సింహమూర్తి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, గార మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **ఆమదాలవలస:**పట్టణంలోని వన్‌వే జంక్షన్‌వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు, గోవింద్‌గోపాల్, షన్ముఖరావు తదితరులు రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

25న గురుకులంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గుజరాతీపేట: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 25న పెద్దపాడు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.మార్చి పదో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరిపామని పేర్కొన్నారు. ఇంకా మిగిలిఉన్న ఖాళీలకు ప్రవేశపరీక్ష రాసి సీటు పొందని విద్యార్థులు, ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పదో తరగతి మార్కుల మెరిట్ ప్రాతిపదికన ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెంకటాపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

శ్రీకాకుళంరూరల్: మండలంలోని వెంకటాపురంలో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మ పీడీ ఎ.రామచంద్రరావు, చంద్రమౌళి, ఎస్.సునంద, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌కు 44 మంది గైర్హాజరు

ఎచ్చెర్ల: జిల్లాలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వరఇంజినీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల),కోర్‌టెక్నాలజీస్ (నరసన్నపేట),ఐతం (టెక్కలి)లో జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఏపీ ఈఏపీ సెట్- 2024 పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్నాయి. మంగళవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో 459కు 433 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 358కు 340 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 44 మంది గైర్హాజరయ్యారు.

లిఫ్ట్‌లో దుర్వాసన నివారణకు చర్యలు


లిఫ్ట్‌లో క్లీనింగ్ పనులు చేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో ఉన్న లిఫ్ట్‌లో దుర్వాసన నివారణకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. రిమ్స్‌లోని లిఫ్ట్ ఫ్యాన్‌లో ఎలుక చనిపోవడంతో దుర్వాసనతో రోగులతో పాటు వైద్యులు అవస్థలు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'రిమ్స్‌కెళ్తే రోగాలు తప్పవు' శీర్షిక కథనం ప్రచురితమయ్యింది. దీంతో రిమ్స్ ఆర్ఎంవో సుభాషిని స్పందించి లిఫ్ట్ ఫ్యాన్‌లో చనిపోయిన ఎలుకలను తొలగించే చర్యలు చేపట్టారు. బాత్ రూమ్‌లు, పారిశుధ్యసమస్యపై రిమ్స్‌శానిటేషన్ పీఆర్వో మామిడి రమేష్ ఆధ్వర్యంలో క్లీనింగ్ పనులు చేపట్టారు.

అధికారుల ఆదేశాలతో అన్నదాతకు అగచాట్లు

● క్యాన్లు, సీసాల్లో పెట్రోల్, డీజిల్ నింపవద్దని బంకులకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు
● ట్రాక్టర్ యజమానులు, రైతులకు తప్పని ఇబ్బందులు

ఇచ్ఛాపురం: క్యాన్లు, సీసాల్లో పెట్రోల్ నింపవద్దని ఎన్నికల కమిషన్ అధికారులు బంకుల నిర్వాహకులకు ఆదేశాలివ్వడంతో రైతులు,ట్రాక్టర్ యజమానులకు శరఘతంగా మారింది. ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు పొలాలు చదును చేయడంలో నిమగ్నయ్యారు. ఖరీఫ్‌లో విత్తనాలు చల్లేందుకు పొలాలుసిద్ధం చేస్తున్నారు.రైతులు కాడెద్దుల పోషణ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో పొలాలు చదును చేసేందుకు డీజిల్ ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు.పోలింగ్ తర్వాత రాష్ట్రంలో జరుగుతున్నసంఘటన వల్ల బాటిళ్లు, క్యాన్లల్లో డీజిల్, పెట్రోల్ నింపవద్దని ఉన్నతాధికారులు బంకుల యజమానులకు ఆదేశాలు జారీచేయడంతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు.ట్రాక్టరు యజమానులు క్యాన్ల ద్వారా డీజిల్ నింపుకొని తీసుకెళ్లి పొలాల్లో పనులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఈసీఅధికారులు ఆంక్షల నేపథ్యంలో ట్రాక్టర్ యజమానులు, రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం మండలం, మునిసిపాలిటీ పరిధిలో వందలాది ట్రాక్టర్లతో సాగు చేస్తున్నారు. పట్టణపరిధిలో ఒక బంకు ఉండగా పట్టణానికి ఆనుకుని ఒడిశాలో మరో మూడు బంకులు ఉన్నాయి. ట్రాక్టర్ల యజమానులు ఈ బంకుల్లో తమ అవసరాలకోసం డీజిల్ కొనుగోలుచేసేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లోజరిగిన అల్లర్లలో పెట్రోల్‌బాంబులు ఉపయోగించడంతో హింస చెలరేగింది.దీంతో బంక్‌ల్లో వాహనాలకు మాత్రమే డీజిల్,పెట్రోల్‌ను వేయాలని, బాటిళ్లలో నింపితే బంక్‌ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో బంక్‌యజమానులు క్యాన్లు, సీసాల్లో పెట్రోల్, డీజిల్ పోయడం నిషేధించారు. దీంతో యజమానులు తమ ట్రాక్టర్ తీసుకువచ్చి డీజిల్‌ను నింపుకొని వ్యవసాయ పనులకు వెళ్లాల్సివస్తోంది.బంక్‌ల్లో తమకు మినహాయింపు ఇవ్వాలని ట్రాక్టర్ యజమానులు కోరుతున్నారు.

విడిగా పెట్రోల్ అమ్మితే చర్యలు: ఎస్ఐ

గార:బంకుల్లో విడిగా పెట్రోల్ అమ్మితే చర్యలు తీసుకుంటామని గార ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఒకప్రకటనలో తెలిపారు.ఈమేరకు గార,శ్రీకూర్మం, జొన్నలపాడు బంకులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈసీ నిబంధనలు అమలులో ఉండడంతో బాటిళ్లు,క్యాన్‌ల్లో పెట్రోల్ ఇవ్వరాదని కోరారు. బయట పాన్‌షాపులు, దుకాణా ల్లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్లకు మినహాయింపు ఇవ్వాలి



దుక్కులు ప్రారంభమయ్యాయి. పొలంలో దుక్కు చేస్తుండగా డీజిల్ అయిపోతే ట్రాక్టర్‌ను తీసుకువెళ్లలేం. క్యాన్ల ద్వారా డీజిల్ ఇచ్చే అవకాశాన్ని కల్పించాలి. ట్రాక్టర్లకు మినహాయింపు ఇవ్వాలి. దూర ప్రాంతం నుంచిట్రాక్టర్‌ను తోసుకుంటూ రాలేము.

-బచ్చు మోహన్, ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్, బొడ్డకాళి

సగంలో రాలేము



తేలుకుంచి నుంచి ఇచ్ఛాపురం బంక్ 10 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఒకసారి ట్రాక్టర్‌తో బంక్‌కు వెళ్లి ఫుల్‌ట్యాంక్ నింపుతాం. ఆయిల్ అయిపోతే సగంలో రాలేము. ట్రాక్టర్లు యాజమానులుకు క్యాన్ల ద్వారా ఆయిల్ ఇచ్చే అవకాశాన్ని కల్పించాలి..

-మేరుగు నారాయణ,ట్రాక్టర్ ఓనర్ కమ్ రైతు, తేలుకుంచి

బంకు, ట్రాక్టర్ యజమానులు సహకరించాలి



పోలింగ్ సమయంలో రాష్ట్రంలో చాలాచోట్ల హింస జరిగింది. హింస పునరావృతం కాకుండా ఉండాలనే కలెక్టర్ ఆదేశాలతో క్యాన్లు, సీసాల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాలు చేయకూడాదని బంక్‌ల యజమానులకు ఆదేశించాం. కోడ్‌ఉన్నంత వరకు బంక్‌లకు ట్రాక్టర్లు తీసుకువెళ్లిట్యాంక్‌నింపుకోవాలి. బంక్, ట్రాక్టర్ యజమానులు సహకరించాలి. క్యాన్లతో ఆయిల్ అమ్మకాలు జరిపినా, పట్టుబడినా కేసులునమోదు చేస్తాం.

- ఇమ్మాన్యుయేల్‌రాజు, సీఐ ఇచ్ఛాపురం

నేడు మండల సమావేశం

శ్రీకాకుళంఅర్బన్:శ్రీకాకుళం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారంఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలు,పలు అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం


సిబ్బందితో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

రణస్థలం:విధినిర్వహణలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సంతోషిపై దాడిచేసిన ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ జీవీ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం కొండములగాం సీహెచ్‌సీలో జరిగిన సంఘటనేపథ్యంలో మంగళవారం ఆసుపత్రిని పరిశీలించారు. సిబ్బందిపై దాడికి సంబందిచిన వివరాలు కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు.సిబ్బందిపై దాడికి పాల్పడిన కెల్ల నవీన్‌కుమార్,జగన్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జేఆర్‌పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

రైసీ మృతికి సంతాపం

గార: హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు రైసీ మృతికి సంతాపంగా అంపోలు సమీపంలోని జిల్లా జైలులో జాతీయ పతాకం అవనతం చేశారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ ఎస్.నబీఖాన్, డీఎస్‌జేవో బి.కృష్ణారావు, జైలర్లు డిప్యూటీ జైలర్లు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.